క్లుప్తంగా

యువత క్రీడల్లో రాణించాలి



వాలీబాల్ కిట్లను అందిస్తున్న రాజేందర్‌రెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని యూత్ నాయకుడు ఎల్లయ్యగారి రాజేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని శీలాంపల్లి గ్రామ యువకులకు ఆయన బుధవారం వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో భగవంత్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, సంతోష్, సుధాకర్‌రెడ్డి, శేఖర్, ప్రభు, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ మహ్మద్‌గౌస్

చిలప్‌చెడ్(నర్సాపూర్): సైబర్ నేరగాళ్లు సాంకేతికతను ఉపయోగించి, పలు రకాల వ్యూహాలతో ఖాతాలోని డబ్బులు దొంగిలిస్తున్నారని, వారి వలలో పడకుండా జాగ్రత్త వహించాలని ఎస్‌ఐ మహ్మద్ గౌస్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రమైన చిలప్‌చెడ్‌లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మహ్మద్‌గౌస్ మాట్లాడుతూ.. పిల్లల చేతికి ఫోన్లు ఇస్తే, వారు గేమ్స్ ఆడుతూ అనవసర లింక్‌లు క్లిక్ చేస్తే, సైబర్ నేరగాళ్ల వలలో చిక్కే ప్రమాదముందన్నారు. సైబర్ నేరగాళ్ల మాయలో పడి బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, తదితర వివరాలు ఇచ్చి మోసపోకూడదన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ యువకులు పాల్గొన్నారు.

ధూమపానంతో ప్రాణాలకు ప్రమాదం



ప్రజలకు వివరిస్తున్న వైద్యులు వికాస్

పెద్దశంకరంపేట(మెదక్): ధూమపానంతో ప్రాణాలకు ప్రమాదమని ప్రభుత్వ వైద్యాధికారి వికాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ధూమపానం, మద్యం సేవించడంతో ఆరోగ్యం దెబ్బతింటుందని వాటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశం, శ్రీదేవి, కమల, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కబడ్డీ శిక్షణ శిబిరం



మాట్లాడుతున్న పీడీ శ్రీధర్‌రెడ్డి

కౌల్దారం(నర్సాపూర్): వేసవికాలం సెలవుల్లో క్రీడల్లో విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు మండలంలోని రంగంపేట ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు సిన వేసవి కబడ్డీ శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో కబడ్డీ క్రీడలో శిక్షణ శిబిరాన్ని నెలరోజుల పాటు కొనసాగించారు. మరోవైపు కరాటేలో సైతం విద్యార్థులు శిక్షణ పొందారు. దాదాపు 60 మంది విద్యార్థులు ఈ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారని పాఠశాల పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు త్వరలోనే జిల్లా క్రీడల శాఖ ఆధ్వర్యంలో ప్రశంస పత్రం అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్, కొత్తపల్లి, హవేలీ ఘనాపూర్ వ్యాయామ ఉపాధ్యాయులు మధు, సిద్దిరాములు, కరాటే మాస్టర్ మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

రైతు వేదిక పరిశీలన



రైతు వేదికను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, తహసీల్దార్

అల్లాదుర్గం(మెదక్): మండలంలోని రైతు వేదికలను బుధవారం తహసీల్దార్ తులసీరాం, ఎంపీడీఓ శంకర్ పరిశీలించారు. జూన్ 3న తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వ్యవసాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమం కోసం రైతు వేదికలను పరిశీలించినట్లు ఎంపీడీఓ శంకర్ చెప్పారు. మండలంలోని గడిపెద్దాపూర్, ముస్లాపూర్, చెవెళ్ల, అల్లాదుర్గం రైతు వేదికల్లో వేడుకలు జరుగుతాయని రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఉత్సవాలను విజయవంతం చేయాలి

నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



వెల్దుర్తి(తూప్రాన్): మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన దశాబ్ది ఉత్సవాల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. జూన్ 2 నుంచి 22 వరకు తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. 20 రోజుల పాటు జరిగే శతాబ్ది ఉత్సవాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ స్వరూప, జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్, ఎంపీడీఓ వెంకట లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని అన్ని గ్రామాల్లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పండగలా నిర్వహించి విజయవంతం చేయాలని ఎంపీపీ రాజునాయక్ తెలిపారు. బుధవారం కౌడిపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో దశాబ్ది ఉత్సవాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఏడీఏ పద్మ, ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి, డాక్టర్ శ్రీకాంత్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు ప్రభాకర్, అరవింద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశికళ, లక్ష్మి, తహసీల్దార్ కమలాద్రి వివిధ శాఖల అధికారులు, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ మనోమోహన్, ఏఓ స్వప్న, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

29 మంది సర్పంచ్‌లకు అయిదుగురే హాజరు..

మండలంలోని 29 మంది సర్పంచ్‌లకు దశాబ్ది ఉత్సవాల కోసం నిర్వహించిన సమావేశానికి కేవలం అయిదుగురు సర్పంచ్‌లు మాత్రమే హాజరయ్యారు.

ఏపీఓ నిద్ర మత్తు..

ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన సమీక్షలో ఎంపీడీఓ శ్రీనివాస్ ఉత్సవాల నిర్వహణపై వివరిస్తున్నాడు. మరో వైపు ఉపాధిహామీ ఏపీఓ పుణ్యదాస్ నిద్రలోకి జారుకున్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ హరికృష్ణ

శివ్వంపేట(నర్సాపూర్): రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఈ జూన్ 2 నుంచి 22 వరకు దశాబ్ది ఉత్సవాలు నిర్వహించేందుకు ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నర్సయ్య, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, ఎస్‌ఐ రవికాంత్‌రావు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.



కౌడిపల్లి(నర్సాపూర్): హాజరైన ముగ్గురు సర్పంచ్‌లు (మొదటి వరసలో)

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ప్రత్యేక అధికారి బీమయ్య, ఎంపీడీఓ జగదీశ్వర్‌రాచారి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు కుబేరుడు, చీకోడ్ పీఏఎసీఎస్ చైర్మన్ దత్తరాజు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

రైతులు సహకరించడం కష్టమే..



మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోతి

నర్సాపూర్ రూరల్: దశాబ్ది ఉత్సవాలకు రైతులు సహకరించడం కష్టమేనని మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు అధికారులతో మొర పెట్టుకున్నారు. బుధవారం నర్సాపూర్ ఎంపీపీ సమావేశ మందిరంలో ఎంపీపీ జ్యోతి సురేశ్‌నాయక్ అధ్యక్షతన ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద చింతకుంట, రాజేంద్రపూర్, తుల్జారంపేట్ సర్పంచ్‌లతో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం, లారీలు రాక రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై అధికారుల ఎదుట మొరపెట్టుకున్నారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల నుంచి వెంటనే తరలించేందుకు చర్యలు తీసుకొని దశాబ్ది ఉత్సవాలను ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ జ్యోతి సురేష్‌నాయక్, ఎంపీడీఓ మార్టిన్ లూథర్, ఆయా శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్ష



దీక్షలో మార్వాడీ మహిళలు

రామాయంపేట(మెదక్): రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా మార్చాలని మార్వాడీ మహిళలు డిమాండ్ చేశారు. రామాయంపేటలో నివాసం ఉంటున్న వారు దీక్షా శిబిరం వద్దకు చేరుకొని తమ మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం వెంటనే డివిజన్ ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. దీక్షలో అఖిలపక్షం ప్రతినిధులు పాల్గొన్నారు.

వాలీబాల్ శిక్షణ పొందడం అభినందనీయం



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి

చిన్నశంకరంపేట(మెదక్): వేసవి శిక్షణ శిబిరం ద్వారా గ్రామీణ యువకులకు క్రీడల్లో శిక్షణ అందించడం అభినందనీయమని ఎంపీపీ భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని జంగరాయి గ్రామంలో నిర్వహించిన వాలీబాల్ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆమె క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, కోచ్ ప్రశాంత్, యువజన సంఘాల నాయకులు ప్రవీణ్‌రెడ్డి, అనిల్, శ్రీధర్, సాయి, సతీష్ పాల్గొన్నారు. ముగింపు సందర్భంగా నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలకు ఎంపీపీ బహుమతులు అందించారు.

సమష్టి నిర్ణయాలతో కాంగ్రెస్ బలోపేతం

రామాయంపేట(మెదక్): ఇక నుంచి సమష్టి నిర్ణయాలతో కాంగ్రెస్‌ని బలోపేతం చేస్తామని పార్టీ జిల్లా నాయకుడు గోవర్దన్ వెల్లడించారు. ఆయన బుధవారం నార్సింగి మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఒంటెద్దు పోకడలకు కాంగ్రెస్‌లో స్థానం లేదన్నారు. పార్టీని బలోపేతం చేసే దిశగా సంస్థాగత నిర్మాణాలు చేపడుతామని, త్వరలో అన్ని మండలాల్లో కమిటీలు ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి చేరికతో జిల్లాలో పార్టీ మరింతగా బలోపేతం అవుతుందని సూచించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందడం ఖాయమని వెల్లడించారు.

కురిసిన వర్షం.. తడిసిన ధాన్యం



శభాష్‌పల్లిలో ధాన్యం సంచుల వద్ద నుంచి వర్షపు నీటిని తొలగిస్తున్న రైతు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. అకాల వర్షం వల్ల కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసిపోయింది. శభాష్‌పల్లిలో అధిక వర్షం కురవడంతో తరలింపుకు సిద్ధంగా ఉన్న ధాన్యం తడిసిపోయింది. కురిసిన వర్షానికి గాను కళ్లల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోవడంతో రైతులకు నష్టం చేకూరింది.

సంక్షిప్త వార్తలు

◆ **విరాళం**



శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామంలో నిర్మిస్తున్న ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా బుధవారం విరాళం అందజేశారు. గ్రామంలో నూతనంగా ఎల్లమ్మ ఆలయాన్ని నిర్మించేందుకు గౌడ కులస్తులు ముందుకు వచ్చారు. తనవంతు సహాయంగా జెడ్పీటీసీ 51 వేల నగదుని ఆలయ నిర్మాణ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌడ కులస్తులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

◆ **బీఆర్ఎస్ కార్యవర్గ నియామకం**



రామాయంపేట(మెదక్): నార్సింగి మండలంలోని నర్సంపల్లి పెద్ద తండాలో బుధవారం బీఆర్ఎస్ కార్యకర్తలు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా బాషానాయక్, ఉపాధ్యక్షుడిగా జగ్యా, కార్యవర్గ సభ్యులుగా బద్యా, పెంట్యా బాల్యా, మోహన్‌ను ఎన్నుకున్నారు. యూత్ అధ్యక్షుడిగా సుభాష్, మహిళా అధ్యక్షురాలిగా పిక్లీ, రైతు సంఘం అధ్యక్షుడిగా చంద్రియా, బూత్ కమిటీ అధ్యక్షుడిగా నెనావత్ గణేశ్, ఉపాధ్యక్షుడిగా మాలోత్ గణేశ్‌ను ఎన్నుకున్నారు. సోషల్ మీడియా అధ్యక్షుడిగా మహేశ్, ఉపాధ్యక్షుడిగా నితిన్, కార్యాదర్శులుగా రమేశ్, ప్రభాకర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తండా సర్పంచ్ చత్రియా నాయక్, పార్టీ నాయకులు తౌర్యా నాయక్, బిక్యానాయక్ హాజరయ్యారు.

◆ **ఘనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ**

చేగుంట(తూప్రాన్): మండలంలోని బీ కొండాపూర్ గ్రామంలో గ్రామ దేవత పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలనర్సు, ఎంపీటీసీ గూటం నవీన్, బీఆర్ఎస్ నాయకులు రాజిరెడ్డితో ఉపసర్పంచ్ రమేశ్‌తో పాటు గ్రామ భక్తులు పాల్గొన్నారు.

◆ **నిర్మాణ పనులు ప్రారంభం**

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని ఏడో వార్డులో నిర్మిస్తున్న అండర్ డ్రైనేజీ స్లాబ్ పనులను సర్పంచ్ శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సురేఖ, వార్డు మెంబర్లు, నాయకులు పాల్గొన్నారు.

◆ **స్టేడియం ఏర్పాటు చేయాలి**



చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని కుంటల స్థలాల్లో క్రీడలకు ఉపయోగపడేలా ఏర్పాటు చేయాలని యువకులు సర్పంచ్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. కుమ్మరికుంటలో బ్యాట్ మెంటన్ స్టేడియం ఇండోర్ స్టేడియం, సింగారికుంటలో పార్కును ఏర్పాటు చేసి, ప్రభుత్వ స్థలాలను కాపాడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సర్పంచ్‌కు వినతిపత్రం అందించిన వారిలో సోమ రవీందర్, విష్ణుకుమార్, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

◆ **పదవీ విరమణ**

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆఫీస్ సబ్ ఆర్డినేట్ సేవలను అందించిన బాల మల్లయ్య బుధవారం పదవి విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఎంపీపీ సిద్దరాములు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాజేందర్, ఎంపీటీసీలు, కార్యదర్శులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో బాల మల్లయ్య దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో నగరం గ్రామ సర్పంచ్ గేమ్సింగ్, పశువైద్యాధికారి సుధాకర్, ఎంపీటీసీలు బాల్‌రెడ్డి, లహరిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో జూనియర్ అసిస్టెంట్ వినయ్, కార్యదర్శులు హరీఫ్ హుస్సేన్, నర్సింలు, వెంకట నర్సింహారెడ్డి, ప్రశాంత్, ప్రేమ, కవిత, మమత, నాగలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ తిరుమల్, భిక్షపతి, బీఆర్ఎస్ నాయకులు కిష్టారెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

◆ **శాంతిభద్రతలకు ప్రజలు సహకరించాలి**

పెద్దశంకరంపేట(మెదక్): శాంతిభద్రతలకు ప్రజలు సహకరించాలని అల్లాదుర్గం సీఐ జార్జ్ అన్నారు. బుధవారం పెద్దశంకరంపేట మండలం రామోజిపల్లిలో కమ్యూనిటీ కనెక్టివిటీ ప్రోగ్రాంలో భాగంగా సైబర్ నేరాలతో పాటు మాదక ద్రవ్యాలకు ప్రజలు అలవాటు పడితే జీవితంలో దుష్పరిమానాలను ఎదుర్కొవాల్సి వస్తుందని, ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల నేరాలు తగ్గుతున్నాయన్నారు. గ్రామంలో సరైన ధృవపత్రాలు లేని పలు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు బాలరాజు, ప్రవీణ్‌రెడ్డి, రమేశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

◆ **బీజేపీలో చేరిక**

నర్సాపూర్ రూరల్: మండలంలోని ఎర్రకుంట పంచాయతీ పరిధిలోని బాల్యతండా గిరిజనలు బుధవారం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లి గోపి, అసెంబ్లీ కన్వీనర్ వాల్దాస్ మల్లేశ్‌గౌడ్, రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో తండావాసులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీనాయకులు గుండం శంకర్, నగేష్, బాల్ రాజు, మనీ గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాల పోచమ్మ బోనాలు



బోనాల ఊరేగింపులో భక్తులు

టేక్మాల్(మెదక్): మండలంలోని చల్లపల్లి గ్రామంలో బుధవారం ముత్యాల పోచమ్మ విగ్రహాన్ని ఘనంగా ప్రతిష్ఠించారు. ఉదయం వేళలో హోమం, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం భక్తులు బోనాలు ఊరేగించి అమ్మవారికి సమర్పించారు.

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంతో పాటు సబ్‌సెంటర్‌ల పరిధిలోని గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. బుధవారం చిన్నశంకరంపేట పీహెచ్‌సీ పరిధితో పాటు సూరారం, కొర్విపల్లి సబ్ సెంటర్ పరిధిలో వైద్య సిబ్బంది గ్రామస్తులతో కలిసి పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. చిన్నశంకరంపేట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి సింధు ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహనలో భాగంగా పొగాకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

గోపన్‌పల్లికి తరలిన బ్రాహ్మణులు



హైదరాబాద్ తరలుతున్న బ్రాహ్మణులు

పెద్దశంకరంపేట(మెదక్): హైదరాబాద్‌లోని గోపన్‌పల్లిలో ప్రభుత్వం నిర్మించిన విప్రహిత బ్రాహ్మణ సదన్ భవన్ ప్రారంభానికి నారాయణఖేడ్ నియోజకవర్గం నుంచి బ్రాహ్మణ సమాజం సేవా సంస్థ నియోజకవర్గ అధ్యక్షుడు కిషన్‌రావు దేశ్‌పాండే ఆధ్వర్యంలో పలు వాహనాల్లో తరలివెళ్లారు. రూ.12 కోట్లతో 9 ఎకరాల్లో నిర్మించిన ఈ భవనం బ్రాహ్మణులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమానికి తరలిన వారిలో ఖేడ్ అధ్యక్షుడు రాఘవేందర్‌రావు, పేట అధ్యక్షుడు రామచంద్రాచారి, గౌరవ అధ్యక్షుడు కృష్ణశర్మ, కల్హేర్ అధ్యక్షుడు అరవింద్, ఉపాధ్యక్షుడు నారాయనరావు, ప్రధాన కార్యదర్శి రాజేశ్వరరావు, గుడి రామాచారి, సతీష్, రాము, సంగన్న, ప్రభాకర్‌రావు, సుధాకర్‌రావు తదితరులున్నారు.

ఏకగ్రీవంగా జిల్లా స్వర్ణకార సంఘం ఎన్నికలు

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని కాళికాదేవి ఆలయంలో జిల్లా స్వర్ణకార సంఘం ఎన్నికలు బుధవారం ఏకగ్రీవమయ్యాయి. ఈ ఎన్నికలకు నామినేషన్ బుధవారం సాయంత్రం 4 గం.లకు చివరిరోజు కావడంతో అధ్యక్ష, కార్యదర్శుల పదవులకు కేవలం ఒక్కొక్క నామినేషన్ రావడంతో ఎన్నిక ఏకగ్రీవంగా మారింది. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పూన రవీందర్, ప్రధాన కార్యదర్శిగా రామయంపేటకు చెందిన సుంకోజు దామోదరు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు రవిందర్ మాట్లాడుతూ... జిల్లాలోని స్వర్ణకారులు అందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉండి సంఘం అభ్యున్నతికి పాల్పడతానని అన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యకుడు నూతన అధ్యక్ష, కార్యదర్శులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారిగా సాయిసిరి వ్యవహరించగా, ముఖ్య అతిథులుగా రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వింజమూరి రాఘవాచారి, చేపూరి వెంకట స్వామి విచ్చేయగా పట్టణ అధ్యక్షుడు రమేశ్, కార్యదర్శి కృష్ణ, లక్ష్మీకాంతం చారి, బ్రహ్మచారి, ఉపేందర్ చారి, స్వర్ణకార సంఘం డెలిగేట్ సభ్యులు పాల్గొన్నారు.

స్పందించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

రేగోడ్(మెదక్): మండలంలోని పోచారం గ్రామంలో వారం రోజులుగా మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోయి నీరంతా వృథాగా పోయింది. దీంతో పాటు నీళ్లు కూడా కలుషితం అయ్యాయి. అధికారులకు ఏ ఒక్కరూ స్పందించలేదు. మే 31న సాక్షి దినపత్రికలో 'భగీరథ నీరు లీకేజీ అనే కథనం ప్రచురితమైంది. దీంతో వారం రోజులుగా స్పందించని అధికారులు సాక్షి కథనంతో దిగొచ్చారు. ఎట్టకేలకు స్పందించిన అధికారులు తమ సిబ్బందిని బుధవారం పంపించి లికేజీకి మరమ్మతులు చేయించారు. కేజీని సరిచేశామని లైన్‌మెన్ రమేశ్ తెలిపారు. సూపర్‌వైజర్ సాయిలు, లైన్‌మెన్‌లు మానిక్యం, నాగులు పాల్గొన్నారు.



లీకేజీకి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

'ముదిరాజ్ మహాసభను జయప్రద్రం చేయాలి'

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో ముదిరాజ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టి అక్షయ్ కుమార్ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి ఈ నెల 5న మెదక్ జరిగే ముదిరాజ్ భవనం ప్రారంభోత్సవం, మహసభకు పాల్గొన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సభకు ముదిరాజ్ కులస్తులతో పాటు ప్రముఖులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సభకు మండలం నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్నాలని తెలిపారు. ప్రభుత్వం ముదిరాజ్‌ల సంక్షేమం కోరకు జిల్లా కేంద్రంలో 2 ఎకరాల భవనం ఏర్పాటుకు కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నిజాంపేట ముదిరాజ్ సంఘ మాజీ అధ్యక్షుడు పోచయ్య, కిష్టయ్య, జాల శ్రీకాంత్, శివకుమార్, సంతోష్ కుమార్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): పట్టణంలో ఈ నెల 5న నిర్వహించనున్న ముదిరాజ్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి జగన్ అన్నారు. పేట ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు పున్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలో నూతన ముదిరాజ్ సంఘం భవనం నిర్మాణానికి రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్, ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండ ప్రకాష్, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి భూమిపూజకు హాజరవుతున్నారన్నారు. గౌరవ అధ్యక్షుడు శంకరయ్య, సర్పంచ్‌లు కవిత,నరేష్ తదితరులున్నారు.

టేక్మాల్(మెదక్): కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర యూత్ కన్వీనర్ జగన్, మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మాణేయ్య ముదిరాజ్, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేతనాల పెంపుతో అర్చకుల హర్షం

తూప్రాన్: ధూప దీప నైవేద్య స్కీమ్ ద్వారా అర్చకులకు వేతనాలు రాష్ట్ర ప్రభుత్వం పెంచినందుకు ఈ సంఘం జిల్లా అధ్యక్షుడు శలాక రాజేశ్వర శర్మ, కార్యదర్శి బసవలింగప్ప కోశాధికారి ప్రవీణ్ శర్మ సీఎం కేసీఆర్‌కు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. బ్రాహ్మణ భవన ప్రారంభోత్సవంలో ధూప దీప నైవేద్య స్కీమ్ కింద రూ.6వేలు అర్చకులకు సరిపోదన్న విజ్ఞప్తి మేరకు రూ.10 వేలకు పెంచుతూ సీఎం ప్రకటించిన నేపథ్యంలో కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో శ్యాంసుందర్, ప్రభు, లింగం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అర్చకులు

ఈదురు గాలులతో రోడ్డుపై కూలిన చెట్లు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలో ఈదురు గాలులు వీచడంతో రోడ్డుపై చెట్లు విరిగిపడిన సంఘటన మండలంలోని వెంకటాపూర్ అగ్రహారం శివారులో చోటు చేసుకుంది. బుధవారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు వెంకటాపూర్ అగ్రహారం – చెట్లగౌరారం రోడ్డులో చెట్లు దారికి అడ్డంగా పడిపోయాయి. దీంతో వాహనదారులు ఆ చెట్లను దారి నుంచి తొలగించారు.



రోడ్డుపై పడిపోయిన చెట్లను తొలగిస్తున్న వాహనదారులు